క్లుప్తంగా

బీజేపీలో చేరిక



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాంనగర్ పంచాయతీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం బీజేపీలో చేరారు. కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు నివాసంలో నాయకులు మొనితోశ్ మండల్, అశీమ్, అశోక్, సుకుదేవ్, భూపతి సర్కార్, దూశె సర్కార్, రాహుల్ మండల్, అనుకుల్ రాయ్, సంజీత్‌మండల్, గోపాల్ మండల్ కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ నాయకులు గోవింద్ మండల్, అశుతోశ్ మండల్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



సావర్‌ఖేడాలో మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని రాంనగర్, సావర్‌ఖేడా, కల్లెగాం, వాడిగూడ, అడ గ్రామాల్లో గురువారం బడిబాట కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదివిన విద్యార్థుల పైచదువులకు వెళ్లాలంటే గోయగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి బడిబాటలో అధిక మంది విద్యార్థులను బడిలో చేర్పించాలన్నారు. హెచ్ఎంలు రంగయ్య, దివ్యశ్రీ, టీచర్లు ప్రవీణ్, భరత్‌రావు తదితరులు ఉన్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి



గోడం నగేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన ఎంపీ గోడం నగేశ్‌ను ఆయన నివాసంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



చర్చిస్తున్న చైర్ పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం చైర్‌పర్సన్ శ్వేత సమీక్ష చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు ఇతర అధికారులు, పలువురు కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మిషన్ భగీరథ పైపులైన్ పనులు వేగవంతంగా చేపట్టాలని, పారిశుధ్యం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు బండి ప్రభాకర్, కొమ్ము సురేష్, మున్సిపల్ ఏఈ సందీప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

కోటపల్లి: అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ హెచ్చరించారు. సర్వాయిపేట గ్రామంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, రసీదులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని యజమానులకు సూచించారు. రైతులకు కనబడే విధంగా విత్తనాల స్టాక్ వివరాలు, ధరలు రోజువారీగా నోటీసు బోర్డుపై రాయాలని ఆదేశించారు. అధిక ధరలకు అమ్మినా, రైతులకు బిల్లులు ఇవ్వకపోయినా, సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచకపోయినా వేరే జిల్లాకు విక్రయించిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, ఏఈవో రాజుకుమార్ పాల్గొన్నారు.

స్త్రీశక్తి భవనానికి మోక్షమెప్పుడో?

- రెండుసార్లు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఇరుకుగదిలో సమావేశాలు
- ఇబ్బందుల్లో సభ్యులు



మండల కేంద్రంలోని గౌతమి మండల సమాఖ్య భవనం

రెబ్బెన: మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించటంలో స్వయం సహాయక సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. వారిని గ్రూపుగా ఏర్పడి పొదుపు అలవాటు చేసుకోవటంతోపాటు బ్యాంకులు అందించే రుణాలతో కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. అలాంటి సంఘాల సభ్యులు సమావేశం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనువుగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో ఏళ్లు గడుస్తున్నా స్త్రీశక్తి భవన నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా ప్రతీ మండలానికి రూ.25 లక్షల వ్యయంలో స్త్రీ శక్తి భవనాన్ని మంజూరు చేసింది. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిర్మాణం జరగలేదు. ఆపై నిధులు వెనక్కి మళ్లాయి. ప్రభుత్వం రెండోసారి నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టలేదు. దాంతో మరోసారి నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఇంజనీరింగ్ అధికారులు చొరవ తీసుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.

ఎవరూ చేపట్టాలో తెలియక..

ప్రత్యేక రాష్ట్రంలో 9 ఏళ్ల క్రితం ప్రభుత్వం రూ.33 లక్షలతో భవనాన్ని మంజూరు చేసింది. ప్రస్తుతం ఉన్న గౌతమి మండల సమాఖ్య భవనం గంగాపూర్ పంచాయతీ పరిధిలో ఉంది. రెబ్బెన, గంగాపూర్‌లో ఏ పంచాయతీ ఆధ్వర్యంలో పనులు చేపట్టాలో తేలకపోవడంతో పనులకు ముందడుగు పడలేదు. దాంతో ప్రభుత్వం రెండోసారి మంజూరు చేసినా నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఆపై అధికారులు భవనం కోసం సర్కారుకు ప్రతిపాదనలు పంపిస్తున్నా స్పందన లేకుండా పోతోంది. ఏళ్లుగా భవనం కోసం సంఘాల సభ్యులు ఆశగా ఎదురుచూస్తున్నా కల సాకారం కావడం లేదు.

7203 మంది సభ్యులు

రెబ్బెన మండలంలోని గౌతమి మండల సమాఖ్య పరిధిలో 26 గ్రామైఖ్య సంఘాలు పని చేస్తున్నాయి. సంఘాల పరిధిలోని 637 స్వయం సహాయక సంఘాలు ఉండగా వాటిలో 7203 మంది సభ్యులు ఉన్నారు.

ఇరుకు గదితో ఇబ్బందులు

మండల కేంద్రంలో ప్రస్తుతం మండల సమాఖ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న భవనం ఇరుకుగా ఉంది. దీంతో సభ్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి రెండు గదులు, 50 మందికి సరిపడా సమావేశం మందిరం ఉంది. అంతకు మించి సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తే నిలబడాల్సిన పరిస్థితి. శిథిలావస్థకు చేరిన భవనం, చిన్నపాటి వర్షానికి పైకప్పు రేకులు ఊరుస్తోంది.

గది సరిపోవడం లేదు



మండల సమాఖ్య కార్యాలయంలో సభ్యులకు హాల్ ఏమాత్రం సరిపోవడం లేదు. సమావేశాలు నిర్వహించాల్సిన సమయంలో ఇబ్బంది పడుతున్నాం. కొందరు సభ్యులు నిల్చొని వినాల్సి వస్తోంది.

– వనమాల మౌనిక, రెబ్బెన

స్త్రీ భవనం నిర్మించాలి



రెబ్బెన మండలానికి శ్రీ శక్తి భవనాన్ని నిర్మించాలి. సమావేశాల నిర్వహణకు అనువైన వసతి లేక సభ్యులకు ఇబ్బందిగా ఉంది. అధికారులు మండలానికి భవనం మంజూరయ్యేలా కృషి చేయాలి.

– వేముర్ల అమృత, మండల సమాఖ్య అధ్యక్షురాలు

ప్రతిపాదనలు పంపించాం

రెబ్బెన మండల సమాఖ్య భవనానికి నిధులు మంజూరు కాలేదు. ఇప్పటి రెండు సార్లు ప్రభుత్వం భవనాన్ని మంజూరు చేయగా ఒకసారి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. రెండోసారి ఎవరూ పనులు చేపట్టాలో తేలక ప్రారంభం కాలేదు. సర్కారు మరోసారి ప్రతిపాదనలు పంపించాం.

– వెంకటరమణ శర్మ ఏపీఎం



ఆలయ ప్రాంగణంలో పల్లె ప్రకృతివనం !



కెరమెరి: మండలంలోని సాంగ్వి పంచాయతీ రాంనగర్ గ్రామంలో దేవుని ఆలయ ప్రాంగణంలో పల్లె ప్రకృతివనం ఉంది. గతంలో అధికారుల తప్పిదమే ఇందుకు కారణం. ప్రకృతి వనానికి ప్రత్యేక స్థలం కేటాయించినా ఆలయ ప్రాంగణంలో ఉండడం విస్మయానికి గురిచేస్తుంది. అయితే ప్రకృతివనానికి, ఆలయ నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని ఆదివాసీలకు అధికారులు నచ్చజెప్పారు. దీంతో ఆలయ ప్రాంగణంలో వనం ఏర్పాటు చేశారు. కాని నిధులు విడుదల కాకపోవడంతో ఆదివాసీలు మిన్నకుండిపోయారు.

ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్లకు పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో గురువారం బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్ల కోసం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. బీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్ పదోన్నతుల కోసం నిర్వహించిన పరీక్షలకు 22 మంది ఈపీ ఆపరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధి కారులు యంత్రాలపై ఆపరేటర్లకు ఉన్న పని అనుభవంతోపాటు వారి పరిజ్ఞానాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం ఉమాకాంత్, ఫిట్ ఇంజనీర్ వీరన్న, కార్పొరేట్ సభ్యులు శ్యాంసుందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, ఇంజనీర్లు మహేశ్వర్, కురేషీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ వేముర్ల సంతోష్

రెబ్బెన: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. గురువారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కేజీబీవీ భవనంతోపాటు సబ్ సెంటర్లను ప్రారంభించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న సులభ్ కాంప్లెక్స్‌ను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. పైకాజీగూడ, రాంపూర్, పులికుంట, గొండుగూడ రోడ్లకు కంకరపోసి వదిలేశారని వెంటనే తారువేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్కళ్లపల్లి, గోలేటి ఎక్స్‌రోడ్, రెబ్బెన, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బస్‌షెల్టర్లు నిర్మించాలని కోరారు. కొండపల్లి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని, తుంగెడ ప్రభుత్వ పాఠశాలకు, రెబ్బెన ఎన్టీఆర్ కాలనీలో బోరు సౌకర్యం కల్పించాలని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీలు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

దుగ్నెపల్లిలో ఉపాధ్యాయుల సర్వే



విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న ఉపాధ్యాయులు

బెల్లంపల్లిరూరల్: 'మా ఊరి టీచర్ ను బదిలీ చేయండి' అంటూ బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాజు కాంబ్లే సక్రమంగా విధులకు హాజరుకాక పోవడంతో విద్యార్థులు ఇతర పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంగళవారం దుగ్నెపల్లి గ్రామస్తులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. గురువారం బెల్లంపల్లి మండల విద్యాధికారి పి.మహేశ్వర్ రెడ్డి ఆదేశాలతో ఉపాధ్యాయులు రాజన్న, జావీద్‌లు దుగ్నెపల్లి గ్రామంలో సర్వే చేపట్టారు. గ్రామంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఎంత మంది విద్యార్థులున్నారు, వారు ప్రస్తుతం ఏఏ పాఠశాలల్లో చదువుతున్నారనే వివరాలను నమోదు చేసుకున్నారు. గ్రామంలో 28 మంది విద్యార్థులు ఉన్నారని నిర్ధారించుకున్నారు. ఆ వివరాలను ఎంఈవో, ఉన్నతాధికారులకు అందజేసి ఉపాధ్యాయుని ఏర్పాటుకు కృషి చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంతోష్‌కుమారి, జుమ్మిడి బానయ్య, సల్లూరి శ్రీనివాస్, సల్లూరి నాగరాజు, కోట వెంకటస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే మా అభిమతం..

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



హాజీపూర్‌లో తోఫా పంపిణీ చేస్తున్న సురేఖ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో గురువారం ముస్లిం కుటుంబాలకు కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో తోఫా పంపిణీ చేశారు. బక్రీద్ పర్వదినోత్సవాన ఇవ్వాల్సిన తోఫాలను ఎలక్షన్ కోడ్ కారణంగా వాయిదా వేశారు. కోడ్ ముగియడంతో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఆధ్వర్యంలో ముస్లిం మహిళా సోదరీమణులకు డీసీసీ అధ్యక్షురాలు సురేఖ చేతుల మీదుగా బక్రీద తోఫాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డె బాలరాజ్, డీసీసీ ఉపాధ్యక్షురాలు మాధవరపు రాజేశ్వర్‌రావు, మల్యాల రాజు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్నారం: బక్రీద్ సందర్భంగా కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ముస్లిం మహిళలకు బక్రీద్ తోఫా అందజేశారు.

దండేపల్లి: అధికారంలో లేకున్నా, ఉన్నా ప్రజాసేవ చేయడమే మా అభిమతం అని డీసీసీ అధ్యక్షురాలు సురేఖ అన్నారు. కొక్కిరాల రఘుపతి రావు ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ముస్లింలకు అందించిన బక్రీద్ తోఫాను గురువారం రాత్రి దండేపల్లిలో పంపిణీ చేశారు. గత కొన్నేళ్లుగా మంచిర్యాల నియోజకవర్గంలోని మహిళలకు బతుకమ్మ చీరలు, ముస్లింలకు రంజాన్ తోఫాలు అందిస్తున్నట్లు చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషిచేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీపీ శ్రీనివాస్, ఆర్‌జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వయో పరిమితి పెంపుపై హర్షం

శ్రీరాంపూర్: సింగరేణి కారుణ్య ఉద్యోగాల్లో డిపెండెంట్ల వయో పరిమితి పెంపుపై ఎస్ఎస్‌యూఐ నాయకులు హర్షం వ్యక్తం చేశా రు. ఐఎన్టీయూసీ నాయకులతో కలిసి సీసీసీ కార్నర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డెప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంచిర్యా ల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు డిపెండెంట్ల వయో పరిమితి 35 ఏళ్ల నుంచి, నేడు 40 ఏళ్లకు పెంచినట్లు తెలిపా రు. ఈ సందర్భంగా వారు సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

చిగురిస్తున్న ఆశలు

- రుణమాఫీకి రైతుల ఎదురుచూపు
- ఆగస్టు 15 వరకు పూర్తి చేసే యోచనలో ప్రభుత్వం
- బ్యాంకుల వారీగా అర్హుల జాబితా సేకరణలో అధికారులు నిమగ్నం
- జిల్లాలో మాఫీ కానున్న రూ.323.84 కోట్ల రుణాలు



బెజ్జూర్: రుణమాఫీపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో రైతన్నలు ఎదురుచూస్తున్నారు. ఇందుకుగాను ప్రభుత్వం కటాఫ్ తేదీపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అధికారులు బ్యాంకుల వారీగా అర్హుల జాబితా సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కుమురంభీం జిల్లాలో రూ.323.84 కోట్ల రుణాలు మాఫీ అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో చాలామంది బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు రెన్యూవల్ చేయలేదు. ఎక్కువగా సన్న, చిన్నకారు రైతులు ఉన్నారు. వారంతా రుణమాఫీ చేస్తే ఆర్థిక తోడ్పాటు వస్తుందనే భరోసాతో ఉన్నారు. రూ.లక్ష లోపు ఎక్కువ మంది రైతులు రుణాలు తీసుకున్న వారు ఉన్నారు. రాష్ట్ర సహకార బ్యాంక్ ఆదేశాలతో రుణమాఫీపై సహకార బ్యాంక్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. బ్యాంకుల వారీగా ఎంత మంది రుణాలు తీసుకున్నారు, వడ్డీ ఎంత, ప్రస్తుతం ఉన్న రుణం ఎంత తదితర వివరాలను సేకరిస్తున్నారు. కాగా, మాఫీకి సంబంధించిన విధివిధానాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

జిల్లాలో రూ.323.84కోట్ల రుణాలు..

కుమురంభీం జిల్లాలో మొత్తం 62,888 మంది రైతులు ఆయా బ్యాంకుల ద్వారా రూ.323.84 కోట్ల రుణాలు తీసుకున్నారు. గతంలో బ్యాంకుల్లో అప్పులు తీసుకున్న రైతులకు అప్పటి ప్రభుత్వం తొలి విడతలో రూ.50 వేల లోపు రుణం ఉన్నవారికి రెండో విడతలో రూ.99 వేల వరకు రుణం ఉన్నవారికి రుణమాఫీని వర్తింపజేసి అమలు చేసింది. కొందరు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. పాత రుణం రద్దు చేసి వారికి తిరిగి కొత్త పంట రుణం మంజూరు చేశారు. రుణమాఫీ వారికి మినహాయించి మిగతా వారికి ఇస్తారా.. లేక అందరికీ వర్తింపజేస్తారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ అందరికీ అయితే మాత్రం 2023లో రుణమాఫీ పొందిన రైతులకు డబుల్ ధమాకా ఆఫర్ కానుంది. ఒకే ఆర్థిక సంవత్సరంలో రెండు ప్రభుత్వాల నుంచి రుణమాఫీ వచ్చినట్లు అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. కుటుంబంలో ఒకరికే వర్తింపజేస్తారా.. లేక రుణం తీసుకున్న అందరికీ ఇస్తారా అనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఆదేశాలు జారీ..

సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న రుణమాఫీ చేయాలని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బ్యాంకుల వారీగా రుణమాఫీ అర్హుల జాబితాను బ్యాంకర్లు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. 2019 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబర్ 10 వరకు రూ.2లక్షల రుణాలు తీసుకున్న రైతుల వివరాలను తెలంగాణ సహకార బ్యాంకు కోరింది. జిల్లాలో ఆ సమయంలో రుణాలు తీసుకున్న రైతుల లెక్కా తేల్చి బ్యాంక్‌కు పంపనున్నారు. అయితే తీసుకున్న రుణం ఏటా చెల్లించిన బ్యాంకుల్లో ఖాతా కలిగి ఉండాలి. ఏటా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న రుణమాఫీకి సంబంధించి కటాఫ్ తేదీ ఎవరెవరికి వర్తింపజేయాలనే దానిపై మార్గదర్శకాలు జారీ కావాల్సి ఉన్నాయి.

వెంకట్రావుపల్లి కార్యదర్శిపై డీఎల్‌పీవో విచారణ



విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో ధర్మరాణి

జైపూర్: విధులపై అశ్రద్ధ చేస్తూ ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్లో నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వెంకట్రావుపల్లి పంచాయతీ కార్యదర్శి రమాదేవిపై వచ్చిన ఫిర్యాదులపైన డీఎల్‌పీవో ధర్మరాణి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జైపూర్ మండలం వెంకట్రావుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ప్రజల సమక్షంలో కార్యదర్శి రమాదేవిపై వచ్చిన ఫిర్యాదులపై విచారించారు. ప్రజలు ప్రజాపాలనలో భాగంగా పథకాల కోసం దరఖాస్తు చేసుకోగా, వాటిని సకాలంలో ఆన్‌లైన్లో నమోదు చేయకపోవడంతో సుమారు 15మంది లబ్ధిదారులు నష్టపోయారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యాలయానికి సక్రమంగా రాకపోవడం ప్రజాసమస్యలను పట్టింపు చేయడం లేదని స్థానికులు వాపోయారు. కాగా కార్యదర్శి రమాదేవిని అధికారులు వివరణ కోరగా కటాఫ్ గడువులోపు ఆన్‌లైన్లో నమోదు చేయలేకపోయానని, గడువు ముగిశాక ప్రయత్నించినా ఆన్‌లైన్ కాలేదని తెలియజేసినట్లుగా తెలిపారు. ఇందులో ఎంపీవో అనిల్, స్థానిక ప్రజలు ఉన్నారు.

16న సమావేశం

పాతమంచిర్యాల: మంచిర్యాల పట్టణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో ఈ నెల 16న ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఠాకూర్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఎన్నికల నిర్వహణ కోసం అడహక్ కమిటీ సభ్యుల ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు కొనసాగించాలని వినతి

చెన్నూర్: మున్సిపాలిటీలో నిలిచిపోయిన రూ.28కోట్ల అభివృద్ధి పనులను కొనసాగించాలని కోరుతూ హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేసినట్లు మున్సిపాల్ వైస్ చైర్మన్ నవాజ్ తెలిపారు. ఈ సందర్భంగా నవాజ్ మాట్లాడుతూ చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంతర్గత రోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.28కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయని, నిధుల మంజూరుకు సంబంధించిన జీవో పత్రాలను సైతం ఎమ్మెల్యేకు అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సానుకులంగా స్పందించారని జీవో కాపీలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మందమర్రిరూరల్: వచ్చే వర్షాకాలం సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రభుత్వ వైద్యాధికారి రమేష్‌తో కలిసి మండల స్థాయి అధికారులకు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించాలని, కాల్వలోని పూడికను తీయించాలని, నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈజీఎస్ ఏపీవో రజియా సుల్తానా, ఐకేపీ ఏపీఎం లలిత కుమారి, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్ ఏవోగా శ్రీనివాస్

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయాధికారిగా ఎస్.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. జైపూర్ ఏవో మార్క్ గ్లడ్‌సన్ ఇంత కాలం చెన్నూర్ ఇన్‌చార్జిగా పని చేశారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌ను చెన్నూర్ ఏవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం బాధ్యతలు చేపట్టారు.